06ATP27_06ATP27.qxd 29-04-2023 PM 11:23 Page 1



## మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను పరామర్శించిన ఎంఎల్‌ఏ కేతిరెడ్డి



మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను పరామర్శిస్తున్న ఎఎల్‌ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**బత్తలపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మదలంలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ముష్టూరు చిన్న నరసింహారెడ్డిని ధర్మవరం ఎంఎల్‌ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. గత కొంతకాలంగా నరసింహారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం గ్రామానికి చేరుకున్న ఎంఎల్‌ఏ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీనియర్ నాయకుల సేవలు మరికొంత కాలం పార్టీకి అవసరం కనుక ఆరోగ్యాన్ని సరిగా చూసుకోవాలని కుటుభట సభ్యులకు సూచించారు. ఎంఎల్‌ఏ వెంట ఏపి కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యక్రాష్‌బాబు, మండల కన్వీనర్ బయపరెడ్డి, అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు వున్నారు.

## మే 5నుండి ఫ్రెండ్స్ II క్రికెట్ టోర్నమెంట్

**బత్తలపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండలకేంద్రంలో మే 5వ తేదీ నుండి ఫ్రెండ్స్ 11 క్రికెట్ టోర్నమెంటు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం నిర్వాహకులు రంగానాయుడు మాట్లాడుతూ ఎంట్రీ ఫీజు రూ. 1666లు చెల్లించి టోర్నీలో పాల్గొనాలన్నారు. పోటీలో గెలిచిన వారికి ప్రథమ బహుమతి కింద రూ. 55,55లు, ద్వితీయ బహమతి కింద రూ. 22,222లు, తృతీయ, చతుర్ది బహుమతుల కింద రూ. 5,555లు అందివ్వడం జరుగుతుందన్నారు. ఎంట్రి చివరి తేదీ మే 3 సాయంత్రం 5గంటల లోపు మాత్రమే ఎంట్రిఫీజు తీసుకోబడుతుందన్నారు. మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సీరీస్‌లు వుంటాయన్నారు. వేదిక బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయం దగ్గర వుంటుందన్నారు. నిబంధనల ప్రకారం టోర్నీ జరుగుతుందన్నారు. ప్రతి జట్టు 15మంది సభ్యులతో కూడి వుంటుందని, అందరి ఆధార్ కార్డులు ఇవ్వవలసి వుంటుందన్నారు. ఒక మ్యాచ్‌లో ఆడిన ప్లేయర్ మరో మ్యాచ్‌లో ఆడడానికి అనర్హులన్నారు. ఎవరి బ్యాటు, బాలు వారే తెచ్చుకోవాలన్నారు. నిర్ణీత సమయంలోపు రాని యెడల అంపైర్ నిర్ణయం ప్రకారం వచ్చిన జట్టుకు విన్ డిక్లేర్ చేస్తామన్నారు.

## చందన అలంకారంలో కనువిందు చేసిన లక్ష్మివెకటేశ్వర్లు



చందన అలంకరణలో లక్ష్మివెంకటేశ్వరస్వామి

**బత్తలపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని శ్రీలక్ష్మివెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మివెంకటేశ్వర్లు చందన అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. శనివారం వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు అర్చకులు సురేష్ చందన అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందన అలంకరణలో వున్న స్వామి, అమ్మవార్లను చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు తీర్ద ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ధాక్షాయని పాల్గొన్నారు.

## కుప్పకూలిన శ్రీవారి రథాన్ని పరిశీలించిన టీడీపీ నాయకులు

**-భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని సూచన**



పెన్నహోబిళంలో కూలిన శ్రీవారి రథాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెన్నహోబిళంలో శనివారం మరమ్మతుల సమయంలో కుప్పకూలి ధ్వంసమైన శ్రీ లక్ష్మినరసింహస్వామి రథాన్ని టీడీపీ నాయకులు పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షులు ఎన్.విజయ భాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, మాజీ ఎంపీపీ వి.సుంకరత్నమ్మ, పార్టీ అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు రేగటి నాగరాజు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ దేవినేని పురుషోత్తం, సీనియర్ నాయకులు యేళ్ల తిమ్మప్ప తదితరులు రథాన్ని పరిశీలించి ఆలయ కార్యనిర్వహణ విజయ్‌కుమార్‌తో మాట్లాడారు. రథం మరమ్మతుల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని ఉండాల్సిందని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

## మరొక రథాన్ని తెప్పించి రథోత్సవం నిర్వహిస్తాం..!

**-దేవాదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్**

**-పెన్నహోబిళంలో కుప్పకూలి ధ్వంసమైన రథం పరిశీలన**



కూలిన రథాన్ని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్



అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 10వ తేదీన పెన్నహోబిళంలో రథోత్సవం నిర్వహిస్తామని ఇందు కోసం ఇతర రథాన్ని దేవాదాయశాఖ అధికారులు తీసుకొస్తారని దేవాదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. శనివారం రథానికి చక్రాలు బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి ధ్వంసమైన రథాన్ని సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు రథాన్ని మరమ్మతులు చేయిస్తూ కొత్త చక్రాలను బిగించడానికి క్రేన్లతో రథాన్ని పైకిలేపిన సమయంలో పుచ్చుపట్టిన రథం విరిగిపోయి రథం మొత్తం కుప్ప కూలిందన్నారు. దేవుడు ఏమి చేసినా మన మంచికేనని ఇప్పుడు కూలిన రథం రథోత్సవం రోజు కూలివుంటే పరిస్థితిని ఊహించలేని విధంగా ఉండేదన్నారు. కుప్పకూలిన రథం పూర్తిగా ధ్వంసమైన కారణంగా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా రథంను తెప్పించి ముందుగా నిర్ణయించిన తేదీలోనే రథోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా కొత్త రథం తయారీకు కూడా చర్యలు వేగవంతం చేసి వచ్చే ఏడాది నాటికి పూర్తీ అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్, అర్చకులు ఏ.ఎన్.ద్వారకనాధార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ యం.నరసింహులు తదితరులు ఉన్నారు.

## ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 1 నుండి ప్రత్యేక తరగతులు

**గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** స్థానిక శంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 1 నుండి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10గంటలనుండి తరగతులుప్రారంభమవుతాయని విద్యార్థినీ, విద్యార్థులు తప్పకుండా హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అలైన్‌మెంట్, హెచ్.పీస్ ప్రతిపాదనలకు ఆమోదం లభించిన వెంటనే పనులు చేపడుతాం

**-ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సెల్ఫీ ఛాలెంజ్‌పై వివరణ ఇచ్చిన హంద్రీనీవా అధికారులు**

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు ముందుకు సాగకపోవడంపై హంద్రీనీవా విభాగం-5 కార్యనిర్వాహక సాంకేతిక నిపుణులు శనివారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జరుగకపోవడంపై ఉరవకొండ ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మెన్ పయ్యావుల కేశవ్ కౌకుంట్లవద్ద హంద్రీనీవా కాలువతో సెల్ఫీ దిగి ప్రభుత్వాన్ని ప్రశ్నించగా ఈ విషయమై ఈనెల 23వ తేదీన "సీయంగారు..హంద్రీ-నీవా వెడల్పు హామీ ఏమైంది..?" అన్న శీర్షికన 'వార్త'లో ప్రచురితమైన వార్తపై వారు స్పందించారు. అనంత వెంకటరెడ్డి హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు మొదటి దశ కాలువ వెడల్పు పనులకు 07-06-2021న రూ.5,182.20 కోట్లకు పరిపాలన ఆమోదం ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగా 15-09-2021న అంచనాల విలువ రూ.2,904.04 కోట్లకు సాంకేతిక అమోదం వచ్చిందన్నారు. ఈక్రమంలోనే హంద్రీనీవా కాలువ వెడల్పు పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారు ఎం/ఎస్ డి.ఎస్.ఆర్-వి.పి.ఆర్ (జె.వి) అను సంస్థ ఇన్విస్టిగేషన్ పనులు కొంత మేరకు పనిచేసి అందుకు సంబంధించిన అలైన్‌మెంటు, హెచ్.పీస్ ప్రతిపాదనలను ఆమోదం కొరకు సంబంధించిన పై అధికారులకు పంపడం జరిగిందన్నారు. ఆమోదంవచ్చిన వెంటనే కాలువ వెడల్పు పనులు చేపడుతామని పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా ఈ సంవత్సరం 26-07-2022వ తేదీ నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని కాలువకు 26-03-2023 వరకు నీరు వచ్చిందని వివరణ ఇచ్చారు.

## రసాభాసగా మారిన మున్సిపల్ సమావేశం



వాదోపవాదాలు చేసుకుంటున్న కౌన్సిలర్లు దృశ్యం

**పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త** పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య జరిగిన వాదోపవాదాలతో రసాభాసగా మారింది. శనివారం మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అజెండాలో వరుసగా 10 కాంట్రాక్ట్‌పనులు విశ్వనాథ్ రెడ్డికే అప్పగించినట్లు చదువుతుండడంతో టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి అడ్డుతగిలారు. ఎవరు విశ్వనాథ్ రెడ్డి ఏకపక్షంగా కేవలం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి బంధువు కావడంతో కమీషనర్ కుమ్మక్కు అయి అన్ని పనులు ఒక్కరికే కట్టబెట్టారని ఆరోపించారు. కమీషనర్ వెంకటరామిరెడ్డి జోక్యం చేసుకొని పత్రికలో యాడ్ ఇచ్చామని, ఆన్‌లైన్‌లో రాష్ట్రంలో ఎక్కడి నుండైనా టెండర్లు వేయవచ్చన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. దీంతో రత్నప్ప చౌదరి మాట్లాడుతూ, అధికారులు ఎక్కడికైనా ఉద్యోగ రిత్యా బదిలీ కావచ్చని, కానీ ఇక్కడ ఉన్న ఛైర్మన్ మెడకు చుట్టుకుంటుందన్నారు. దీంతో అధికార పక్ష కౌన్సిలర్లు చెరవు భాస్కర్ రెడ్డి, సాయిగీత, వైస్ ఛైర్మన్ తిప్పన్న, సూర్యగౌడ్ వ్యక్తిగతంగా ఆరోపనలు చేయడం సరికాదని, రౌజీ ఇజం చేస్తూ సభ గౌరవాన్ని మంటగొలుపుతున్నారని ప్రతిపక్ష కౌన్సిలర్లపై ధ్వజమెత్తారు. టిడిపి ప్రాతినిథ్యం వహిస్తున్న వార్డులలో ఒక్కపని కూడా చేయలేదని, ప్రతి పక్ష నాయకులు మండిపడ్డారు. కమ్మవారిపల్లిలో త్రాగు నీరు, వీధి లైట్లు, గోకులంలో లోపించిన పారిశుద్ధ్యం తదితర అంశాలను లేవనెత్తారు. ఈ సమావేశం నుండి వాకౌట్ చేస్తున్నామని టిడిపి కౌన్సిలర్లు సమావేశం నుండి బయటకు వెళ్ళిపోయారు. దీంతో మూకుమ్మడిగా అధికార పక్ష కౌన్సిలర్లు రత్నప్ప చౌదరి వ్యవహార శైలి బాగాలేదని, ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం తగదని వాదనకు దిగారు. ఇరుపక్షాల నాయకుల వాదోపవాదాలతో సమావేశంలో గందరగోళం నెలకొంది. అనంతరం వివిధ పనులకు కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది.

## నిర్దేశిత గడువులోగా నాడు-నేడు పనులు పూర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్



హాజరైన సంబంధిత అధికారులు

**పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** మనబడి నాడు-నేడు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తీ చేయాలని శ్రీసత్యసాయి జిల్లా సంయక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు మనబడి నాడు-నేడు పనుల పరోగతిపై పంచాయతీరాజ్, విద్యా, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సంయుక్త కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాడు-నేడు పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జిల్లాలో మంజూరైన అదనపు తరగతి గదులు వెంటనే పూర్తీ చేయాలని సిమెంట్ కొరత లేకుండా రెండురోజుల్లోగా ఆయా మండలాలకు సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పనుల నాణ్యతలో రాజీపడే ప్రసక్తేలేదని, ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారులు పాఠశాలల సుందరీకరణ, మౌళిక వసతుల కల్పన పనులపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోమన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్న నాడు-నేడు పనులను సత్వరం పూర్తీ చేయాలన్నారు. పనుల్లో భూ సేకరణ,ఇ తర సమస్యలు ఇస్తే వెంటనే తన దృష్టికి నిదించాలని, జిల్లాలో 740 నూతన మరుగుదొడ్ల నిర్మాణాలు మంజూరు కాగా, ఇందులో 34 పూర్తయ్యాయని, మేజర్ మరియు మైనర్ మరమ్మత్తు పనులకు సంబంధించి మే 10లోగా పూర్తీ చేయాలన్నారు. ఇందులో ఇదివరకే తరగతి గదులు, ఇతర మరమ్మత్తుల కొరకు 758 పనులు మంజూరు కాగా, ఇప్పటి వరకు 38 పూర్తయ్యాయని, మిగిలినవి మే 15 లోగా పూర్తీ చేయాలని ఆదేశించారు. 754 మరుగుదొడ్లు మంజూరు కాగా, కేవలం 9 మాత్రమే పూర్తయ్యాని, వీటిని కూడా మే 10లోగా పూర్తీ చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాఠశాల సంసిద్ధ నివేదికలో వీటికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ముఖ్యంగా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పెండింగ్‌లో ఉన్న పనులన్నీ తప్పనిసరిగా పూర్తీ చేయాలని ఆదేశించారు. అలాగే 740 వంటగదులు మంజూరు కాగా, ఇందులో 34 పూర్తయ్యాయని, మిగిలిన వాటిని జూన్ 5వ తేదిలోగా పూర్తీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల విద్యుదీకరణ మరియు ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్ల ఏర్పాట్లకు సంబంధించి 750 పనులు మంజూరు కాగా, ఇందలుఓ 18 పూర్తయ్యాయని, మిగిలిన వాటిని మే 15 లోగా పూర్తీ చేయాలని ఆదేశించారు. అయితే ఎల్క్ట్రికల్ వస్తు సామాగ్రి సరఫరా కొరకు ఇండెంట్‌లు ఆయా ఫీల్డ్ ఇంజనీర్లు తమ లాగిన్‌లలో నమోదు చేయాలని సూచించారు. మరీ ముఖ్యంగా క్షేత్ర స్థాయి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పై తెలిపిన పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. అలాగే ఫీల్డ్ ఇంజనీర్లు పనులను పర్యవేక్షించలన్నారు. పెనుకొండ ఇరిగేషన్ ఇఇ గంగాధర్ మరియు మడకశిర పంచాయతీ రాజ్, డిఇ పద్మావతిల పనితీరుపై జాయింట్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరిరువురూ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని, సంబంధిత శాఖ అధికారులు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్, పంచాయతీ రాజ్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, ఇరిగేషన్ డిఇ వెంకటరమణ, పిహెచ్ఇడిఇ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ చక్రధర్

**అగలి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** అగళి ఆదర్శ పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రుల తోపాటు కమిటీ సభ్యులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ చక్రధర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యలను గురించి ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థులకు తాగు నీరు, మరుగుదొడ్లు సక్రమమైన బోధన, ఈ ఏడు అందాయని, వచ్చే విద్యా సంవత్సరంలో కూడా మంచి బోధనతోపాటు అన్ని సౌకర్యాలను అందించి అగళి ఆదర్శ పాఠశాల మిగతా ఆదర్శ పాఠశాలలకు ఆదర్శంగా ఉంటుందని ప్రిన్సిపాల్ చక్రధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ప్రతిభ, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## పభుత్వ వైపల్యాలను ప్రజల్లోకి తీసుకెల్దాం టిడిపి నాయకులు



టిడిపి సమావేశ దృశ్యం

**అమరావురం,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ వైపల్యాలను ప్రజల్లోకి తీసుకెల్లాలని జిల్లా టిడిపి కార్యదర్శి నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్,ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్ తెలిపారు.మండలకేంద్రంలోని మాజి జడ్పిటిసి ఇంటి అవరణంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు,క్లస్టర్ ఇంచార్జ్‌లు, బూత్‌కన్వీనర్‌ల సమావేసం శనివార ం నార్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వతా అన్ని వర్గల ప్రజలు తీర్వ ఇబ్బందులకు గురి అయినారని నిత్యవసర ధరలు,పెట్రోల్,డిజల్ ధరలు విపరీతంగా పేరిగి సమాన్య ప్రజలకు తీర్వఇబ్బంది కలించారన్నారు ఇసుక గఘనతరమైందని రైతులు పండించిన పంటలకు గిట్టు బాట ధరలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థాని కంగా గ్రామాల్లో అభివృద్ధి శూన్యం అన్నారు.ఇలాంటి సమస్యలను ప్రజలకు తెలిజేయాలన్నారు.టిడిపి పార్టీని అధికారంలోరి తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రంలో సాదికారిత కమిటి సభ్యాలు మంజునాథ్, మైనారిటి నాయకుడు దాదాపీర్,పార్లమెంటు అర్.టి.ఎస్.వెంకటరాముడు, క్లస్టర్ ఇంచార్జ్‌లు రవికుమార్,క్రిష్ణమూర్తి ,యూనిట్ ఇన్‌చార్జ్ లింగరాజు, మూత్‌కన్వీనర్ విద్యసాగర్,రామచంద్ర, నాగరాజు,జితేశ్వర, శివకుమార్, వెంకటరమణ,దాదు తదితరులు పాల్గొన్నారు

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుని కుటుంబీకులను పరామర్శిస్తున్న దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండలంలోని తురకపల్లి గ్రామంలో శనివారం ఉదయం చాకలి బాలు (35) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పశువులకు మేత వేసేందుకు అతను తన వామిదొడ్డి వద్దకు వెళ్లగా ఈదురుగాలుల దాటికి కిందపడిన విద్యుత్ తీగను గమనించకుండా తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అతను సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబసభ్యులను టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలుకిందపడి యువకుడు ఆత్మహత్య



రైలుకిందపడి మృతి చెందిన దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** గుత్తిజిఆర్‌పి పరిధిలోని జక్కలచెరువు సమీపంలో రైలుపట్టాలపై శనివారం మురళి (28) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన ఇతను కుటుంబ సమస్యల కారణంగా ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

**- ఆదివారం కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చు**



మాట్లాడుతున్న కమిషనర్

**పెనుకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఇంటి పన్నుపై ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వంశీ భార్గవ్ అన్నారు.శనివారం ఆయనవిలేకర్లతో మాట్లాడుతూ.. పన్నులు చెల్లింపుపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీ ఆదివారంతో ముగుస్తుందని, పట్టణప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి పన్ను, కొళాయి పన్ను, ట్రేడ్ లైసెన్స్ మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ కౌంటరులో చెల్లించాలని కోరారు. రేపు ఆఖరి రోజు అయినందున ఆదివారం సెలవు దినంలో కూడా మున్సిపల్ కార్యాలయంలో ఇంటిపన్నులు, కొళాయి పన్ను, వాణిజ్య పన్నులుచెల్లించవచ్చన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కార్యాలయంలో కౌంటర్లు పని చేస్తాయన్నారు.

## నేడు వాసవి జయంతి వేడుకలు

**అమరాపురం,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయం నందు వాసవి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా,వెంకటసుబ్బయ్య.భరత్ రాజ్,రాఘవేంద్ర గుప్తా,రమేష్ బాబు,అజయ్,బాలజి,రామోహన్ తెలిపారు.ఈ సందర్భంగా సుప్రభాత సేవా,పంచాబృత అభిశేకం,తిరువీధి ఉత్సవం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తూన్నట్లు అర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు.

## పోరెవ్వులో రంగనాథ స్వామి ఉత్సవాలు

**అమరాపురం,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** మండల పరిధిలో పోరెవ్వు గ్రామునందు వెలసిన శ్రీ రంగనాథ స్వామి ఉత్సవాలను మే 1,2 తేదిలలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు పూజారులు యజమానులు,గౌడ దళవాయిలు తెలిపారు.1న పాలు పోసే పండుగా,2న ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగునని భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు.

## ముగ్గురు విఆర్ ఎస్ఐలకు విముక్తి

**-బాధ్యతలు అప్పజెప్పిన ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి**

**పుట్టపర్తి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త** వివిధ కారణాలతో ఇంతకాలం విఆర్‌లో కొనసాగుతున్న ముగ్గురు ఎస్ఐలకు విముక్తి లభించినట్లు అయ్యింది. ఈ మేరకు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. కె.వీరేష్ పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా, కె.బాబ్జాన్‌ను కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు, ఎస్.నాగేంద్రను జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరోగా ఎస్ఐ హోదా బాధ్యతలను అప్పజెప్పడం జరిగింది. గత కొంత కాలంగా వెకెన్సీ రిజర్వుడ్‌లో నిరీక్షిస్తున్న ఆ ముగ్గురికి వివిధ పోలీస్ స్టేషన్‌లకు అటాచ్ మెంట్ చేస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తున్నటుల ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి తెలియజేశారు.

## వైకేపీ ద్వారా రుణాలిప్పిస్తాం.. ఇళ్లు కట్టుకోండి

**- లబ్దిదారులకు సూచించిన హౌసింగ్ పీడీ కేశవనాయుడు**

**- ఉరవకొండ పట్టణంలోని కొలిమి లేఅవుట్‌లో ఇళ్ల పరిశీలన**



ఇళ్లు కట్టుకోని లబ్దిదారుల జాబితా పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ కేశవనాయుడు. చిత్రంలో జెడ్పీ ఇంచార్జ్ సీఈఓ అమృత్‌రాజ్



లబ్దిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ కేశవనాయుడు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాత వార్త :** వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రుణాలు ఇప్పిస్తామని ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించుకోవాలని హౌసింగ్ పీడీ కేశవనాయుడు లబ్దిదారులకు సూచించారు. శనివారం ఆయన జెడ్పీ ఇంచార్జ్ సీఈఓ అమృత్ రాజ్, స్థానిక హౌసింగ్ అధికారులతో కలిసి పట్టణంలోని కొలిమి లేఅవుట్-2లో జరుగుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించి ఇళ్లు మంజూరైన లబ్దిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఇళ్లు మంజూరైనా ఎందుకు కట్టుకోవడంలేదని పీడీ కేశవనాయుడు లబ్దిదారులను ప్రశ్నించగా పలువురు మాట్లాడుతూ తమ వద్ద డబ్బులు లేవని అప్పులు చేసి కట్టుకోలేమని చెప్పారు. దీంతో ఆయన వైకేపీ ఏపీఎం శివయ్యను అక్కడికి రప్పించి వీరికి రుణాలు ఇవ్వాలని సూచించారు. మహిళా సంఘాలు అప్పులు చెల్లించలేదని అందుకే రుణాలు ఇవ్వలేదని ఏపీఎం చెప్పగా తాము రుణాలు కట్టామని గ్రూపులో ఎవరో కట్టలేదని అందరికీ రుణాలు ఇవ్వకుండా చేస్తే ఎలా అని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పీడీ స్పందిస్తూ డబ్బు కట్టిన సభ్యులకు రుణాలు మంజూరు చేయాలని సూచించి సోమవారం ఇంటి నిర్మాణాలు ప్రారంభించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి. పార్వతమ్మ, సర్పంచ్ మీనుగ లలిత, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, తహశీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, డిప్యూటీ తహశీల్దార్ టి.గురుప్రసాద్, ఎంపీడీఓ పి.చంద్రమౌళి, హౌసింగ్ డీఈఈ హనుమప్ప, ఏఈ గోపి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో కోతలు, వీధి కుక్కలను పట్టిస్తున్న పంచాయతీ

**-ఒంగోలు చెందిన వారికి బాధ్యతలు అప్పగించిన పంచాయతీ**



వీధికుక్కను వలవేసి పట్టుకొంటున్న దృశ్యం

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** పట్టణంలో ప్రజలను ఇబ్బందులపాలు చేస్తూ దాడులకు తెగబడుతున్న వీధి కుక్కలు, కోతులను పట్టించి ఊరికి దూరంగా తరలించే కార్యక్రమానికి మేజర్ గ్రామ పంచాయతీ శ్రీకారం చుట్టింది. ఒంగోలుకు చెందిన కుక్కలు, కోతులు పట్టడంలో నిష్ణాతులకు ఆ బాధ్యతలు అప్పగించగా శనివారం వారు రంగంలో దిగి తొలుత వీధి కుక్కలను పడుతున్నారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ విలేఖరులతో మాట్లాడుతూ కుక్కలు, కోతలు దాడులు చేస్తున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీకు ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధుల నుండి పిర్యాదులు అధికమైన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టామన్నారు. ఒక వీధి కుక్కను పట్టినందుకు 450 రూపాయలు, ఒక కోతికి 550 రూపాయలు చొప్పున ఇస్తున్నామని పట్టిన కుక్కలు, కోతులను రాష్ట్ర సరిహద్దులో అవి మళ్లీ ఇక్కడికి తిరిగి రాకుండా వదిలివేయడం జరుగుతుందని వివరించారు.

## ఆరోగ్యంగా ఉండటానికి వ్యాయామం ప్రధానం..!

**-చిన్నముష్టూరులో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆరోగ్య పరుగు**



చిన్నముష్టూరు గ్రామంలో పరుగు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఆరోగ్యంగా ఉండటానికి వ్యాయామం ఎంతో ప్రధానమని ప్రతిఒక్కరూ తప్పక వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం వారు గ్రామంలో ఆరోగ్య పరుగు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేశారు. మన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేని కారణంగా నిత్యం రోగాల బారిన పడుతున్నామని ప్రతిరోజూ వ్యాయామం, పరుగెత్తడం, యోగ, ప్రాణాయామం చేయడం ద్వారా శరీరం రిచార్జ్ అయి రోగాలు దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.వెంకటేష్‌నాయక్, ట్రిపుల్ యియియి విభాగాధిపతి వై.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**-ఐఓఎల్ ఆపరేషన్ల కోసం 20 మంది ఎంపిక**



లయన్స్‌క్లబ్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు జరుగుపుతున్న ఆప్తాలమిక్ సిబ్బంది

**ఉరవకొండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** ఉరవకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. క్లబ్ సభ్యుడు టి.గణేష్‌బాబు తన 40వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించగా ఆప్తాలమిక్ సిబ్బంది రఫీక్, పరుశురామ్ బృందం 80 మందికి పరీక్షలు నిర్వహించి 20 మందిని ఐఓఎల్ ఆపరేషన్ల కోసం ఎంపికచేసి మరో 18 మందికి అద్దాలు అందించడానికి గుర్తించారు. మధ్యాన్నం కంటి రోగులకు భోజన వసతి కల్పించారు. ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారికి త్వరలోనే అపరేషన్లు చేయించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య శిబిరం దాత టి.గణేష్‌బాబు, క్లబ్ కార్యదర్శి బి.లక్ష్మినారాయణ, గంగాధర్, శ్రీరాములు, గ్రామ సర్పంచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**గుడిబండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం తరుపున వాసవీ కన్యకా పరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో ప్రజలు నిర్వహించి హోమం నిర్వహించారు. ఈ క్రమంలో గణపతి హోమం, సుదర్శన హోమం, నవగ్రహ హోమం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించి అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అభిలాష్, శ్రీధర్, విజయ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

07ATP29_07ATP29.qxd 29-04-2023 PM 11:31 Page 1



## యాచకులకు పాదరక్షలు, గొడుగులు అందచేసిన బాణా



యాచకులకు పాదరక్షలు, గొడుగులు అందచేస్తున్న బాణా నాగేశ్వర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

పట్టణంలోని పురాతన శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయ కమిటీచైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి శనివారం యాచకులకు పాదరక్షలు, గొడుగులు అందచేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి కుమారుడు బాణా ఉదయసింహారెడ్డి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 460/470 మార్కులు సాధించాడు. దీంతో ఆలయం ఆవరణలో భిక్షాటన చేసుకునే యాచకులకు వేసవిని పురస్కరించుకుని చిరుకానుకగా వాటిని అందచేశారు. ముందుగా వారికి ఆలయంలోని చింతలరాయుడు, ఆనందవల్లి అమ్మవారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం ఆలయ కమిటీచైర్మన్ కుమారుడు బాణా ఉదయసింహారెడ్డి చేతుల మీదుగా యాచకులకు పాదరక్షలు, గొడుగులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు నాగిశెట్టి సంజన్న, భూమా హరి, మధ్యాల లత, మల్లెల నారాయణమ్మ, సందేపాకుల రమాదేవి, శ్రీవారి సేవకులు, యాచకులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

పుట్లూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఇతర అధికారులు

హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న పిఎంఎవై(జి) ఇళ్ల నిర్మాణాలను ఎంపిడిఒ యోగానంద రెడ్డి, అసిస్టెంట్ హౌసింగ్ ఇంజనీర్ లోకేష్‌కుమార్, సర్పంచు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మేశ్వరి, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లబ్దిదారులతో మాట్లాడుతూ బిల్లులు సరిగా పడుతున్నాయా లేదా సిమెంట్, ఇసుక ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూలి వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం

-కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిరూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



కాలనీలో తిరుగుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగనన్న తోనే సంక్షేమ పాలన సాధ్యమని యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో శనివారం ఆయన ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. సమస్యలు వుంటే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకరావాలన్నారు. ఎక్కడ సమస్యలు వున్నా పరిష్కరిస్తామని ఆయన కాలనీవాసులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండ్లతోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



ఎంపిడిఒ కొండన్న

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం కింద మండలంలో సన్న, చిన్నకారు రైతులు 2023-24 సంవత్సరానికి సంబంధించి వివిధ రకాల పండ్లతోటల పెంపకం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపిడిఒ కొండన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులు ఎవరైనా వుంటే సన్న, చిన్నకారు రైతు సర్టిఫికెట్, 1-బి అడంగల్ పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, జాబ్‌కార్డు, మండల ఉద్యానవన అధికారిచే పంట దృవీకరణపత్రంకు జతపరిచి సంబంధించి సచివాలయంలో గానీ, ఎంపిడిఒ కార్యాలయంలోగానీ దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపిడిఒ తెలిపారు.

## వలిమ రిసెప్షన్‌లో పాల్గొన్న ఫయాజ్‌బాష



వరునికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఫయాజ్‌బాష

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

పట్టణంలోని షాదీఖానా ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన వలిమ రిసెప్షన్ వేడుకకు ఫయాజ్‌బాష ట్రస్ట్ చైర్మన్, వైసిపి నాయకులు హీరాపురం ఫయాజ్‌బాష ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వరునికి ప్రత్యేక శుభాకా ంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియచేశారు.

## నల్లచెరువులో కుండపోత వర్షం

నల్లచెరువు, ఏప్రెల్ 29, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ఎడతెరపిలేకుండా ఓ మోస్తారు వర్షం, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మండల కేంద్రంలోని స్థానిక 1టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై వర్షపునీరు చెరువు లాగా ప్రవహించి వాహనాల రాకపోకలు అంతరాయం కలిగింది. రహదారికి ఇరువైపుల ఉన్న ఇళ్ళలోకి వర్షపునీరు ప్రవేశించడం వల్ల ప్రజలు ఇబ్బందికి గురయ్యారు.



జాతీయ రహదారిపై చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

## నేలకొరిగిన అరటి, మొక్కజొన్న పంటలు



పడిపోయిన అరటిపంటను చూపుతున్న రైతు ◄ రామకృష్ణ

దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు వెంకట నారాయణరెడ్డి ►



పెద్దపప్పూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండలంలోని పెద్దపప్పూరు, షేక్‌పల్లి, పసలూరు, కుమ్మెత, తదితర గ్రామాల్లో శుక్రవార ం రాత్రి కురిసిన గాలివానకు మొక్కజొన్న పంట దెబ్బతినింది. ఆయా గ్రామాల్లో దాదాపు 50 ఎకరాల్లో దాదాపు 35 మంది రైతులకు చెందిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. అలాగే షేక్‌పల్లి గ్రామంలో రైతులు అశ్వర్థరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డిలకు చెందిన దాదాపు 7 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని వ్యవసాయాధికారుల ముందు రైతులు వాపోయారు. ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## కొనసాగుతున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సేవలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డులో నివసిస్తున్న వద్ది తులసి అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు మాత్రమే వుండడంతో చివరి మజిలీ అంత్యక్రియలు నిర్వహించడానికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యుల సహకారం తీసుకున్నారు. సభ్యులకు విషయం తెలియచేసిన అధ్యక్షులు బాలకృష్ణ వద్ది తులసిని చివరి మజిలీకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, చింతా నరసింహ, చందగాని ద్రువనారాయణ, బడిగించల వేణు, పల్లా ఆంజనేయులు, మెటికల చెన్నయ్య, గాంధీజీ స్కూల్ రామమోహన్, సాయివరకు నాగరాజు, కావలి సుధాకర్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా వైష్ణవి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త




డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

పట్టణ సమీపంలోని పుట్లూరురోడ్డులో వున్న వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పాటలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బిందెల కరుణాకర్‌రెడ్డి, సెక్రటరీ బిందెల సౌజన్య, ప్రిన్సిపాల్ సాయికృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోరు వేయించిన జె.సి అశ్మిత్‌రెడ్డి



పూజలు చేస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మురికి దుస్తులు శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తున్న పట్టణంలోని రజకుల సౌకర్యార్థ ం తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి శనివారం పెన్నానదిలో బోరు వేయించారు. రజకుల విజ్ఞప్తి మేరకు ఆయన బోరు వేయించడం జరిగింది. శుక్రవారం రోజు మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పెన్నానదిలో మురుగునీరు చేరుతున్న ప్రదేశాన్ని పరిశీలించినప్పుడు నదిలో నీరు లేకపోవడంతో మురుగునీటిలో రజకులు దుస్తులు ఉతకడాన్ని చూసి ఆయన చలించిపోయారు. తక్షణం బోరు వేయిస్తామని వారితో చెప్పారు. ఇందులో భాగంగా జె.సి అశ్మిత్‌రెడ్డి భూమిపూజ చేసి బోరు వేయించారు. తమ పట్ల జె.సి కుటుంబం చూపిన ప్రేమను ఎప్పటికి మరిచిపోమని రజకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఒలంపియాడ్‌లో పతకాల మోత



బహుమతులు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఐఎన్‌టిఎస్ ఒలంపియాడ్ రెండవ లెవెల్‌లో ప్రభంజనం సృష్టించారు. అత్యధిక సంఖ్యలో సర్టిఫికెట్స్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్స్ 117, మెరిట్ సర్టిఫికెట్స్ 196, కన్సోలేషన్ 33, స్పెషల్ ప్రైజ్ ఫస్ట్ ప్రైజ్ 1 సాధించారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను ఏజిఎం సుబ్బారెడ్డి అభినందించారు.

ఇది వీరి విజయానికి కారణమైన ఉపాధ్యాయులను వారి కృషి ఎంతో మోఘనీయమని ప్రశంసించారు. రికార్డులను సృష్టించడం ఒక శ్రీ చైతన్యకే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం డీన్లు రిషీ, బాల, అప్పలనాయుడు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏఒ గోపాల్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాడి వేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు - నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేసిన అధికార పార్టీ కౌన్సిలర్



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ ఫయాజ్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పరికి నజిమున్నీసా సాధిక్

కదిరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

కదిరి మున్సిపల్ సమావేశం వాడి వేడిగా సాగింది. శనివారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ భవనంలో చైర్‌పర్సన్ పరికి నజిమున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు వార్డుల కౌన్సిలర్లు వివిధ రకాల సమస్యలపై గళం విప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగాదేవి, మెప్మా పిఎంసిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పిఎంసిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ మిట్ తీర్మాణం చేసి ఆయనపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపినప్పటికీ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ మహిళలను హేళనగా మాట్లాడుతున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మెప్మా అధికారిని పిడికి సరెండర్ చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 26వ వార్డుకౌన్సిలర్ ఫయాజ్ నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని రూములకు టెండర్లు పిలిచి పాడిన వారికి రూములు అప్పగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కల్పించుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ సమస్యను పరిష్కరించే విధంగా అధికారులతో మాట్లాడుదామని తెలిపారు. మహిళా కౌన్సిలర్ దిల్వా దునిషా వివిధ రకాల సమస్యలపై గళమెత్తారు. తమ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. వార్డు పరిధిలోని వాలెంటీర్ బాబ్‌జాన్ అవినీతి అక్రమాలకు తెరలేపుతున్నారని అధికారులు విచారించి వాలెంటీర్‌ను విధుల నుంచి తొలగించాలన్నారు. ఎంఎల్‌ఓ వసీం మున్సిపాలిటీ వార్డు పరిపాలనలో జోక్యం చేసుకుంటూ మితిమీరిన పెత్తనం చలాయిస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ షబ్బీర్ మాట్లాడుతూ..కుటాగుల దర్గా దగ్గర ఫ్లైఓవర్ నిర్మిస్తే దర్గా మొత్తం కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటుందని అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంపై స్పందించిన మున్సిపల్ కౌన్సిలర్ నేషనల్ హైవే అధికారులను స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. మరికొందరు కౌన్సిలర్లు తమ వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలపై కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఓ పత్రికా విలేకరిపై వైస్ చైర్మన్ వాగ్వివాదానికి దిగడంతో అక్కడే ఉన్న కుటాగుల వార్డు కౌన్సిలర్ మహ్మద్ దురుసుగా వ్యవహరించడంతో గందరగోళ పరిస్థితికి దారి తీసింది. వెంటనే చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలో ఉన్న అంశాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిబాబు, వైస్ చైర్మన్లు గంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి, పలు వార్డు కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి బత్తల విరాళం

గాండ్లపెంట, ఏప్రెల్ 29, ప్రభాతవార్త:



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

మండలంలోని వేపరాల గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నిర్మితమవుతున్న శ్రీ కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి కదిరి వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా శనివారం వేపరాల గ్రామానికి వెళ్ళి ఆలయ నిర్వాహకులకు రూ. 25వేల రూపాయల నగదును బత్తల హరిప్రసాద్ చేతుల మీదుగా గ్రామస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ మండల ఉపాధ్యక్షుడు బత్తల ఆదినారాయణ, వైకాపా పట్టణ అధ్యక్షులు బహుద్దీన్, వైకాపా నాయకులు లింగాల లోకేష్‌రెడ్డి, సంపంగి గోవర్ధన్, వెంకట్‌రెడ్డి,రాఘవేంద్ర, రామచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూల్‌డ్రింక్ దుకాణంలో చోరీ



గుర్తుతెలియని దుండగులు తొలగించిన షాపు రేకులను చూపుతున్న బాధిత యజమాని

తనకల్లు, ఏప్రెల్ 29, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో వినాయక కూల్‌డ్రింక్ షాప్ నందు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు షాపు డోర్లు పెరికేసి అందులో ఉన్న డబ్బులు మిషనరీస్‌ను తీసుకు పోయినట్లు కూల్‌డ్రింక్ షాప్ యజమాని ఎం.జగదీష్ తెలిపారు. బాధిత యజమాని మాట్లాడుతూ షాపులో చిల్లర డబ్బులు రూ. 3వేల రూపాయలు పైన, 20వేల రూపాయలు విలువ చేసే జ్యూస్‌లు తయారు చేసే మిషన్‌ను కూడా దొంగిలించినట్లు యజమాని తెలిపారు. ఇదేవిధంగా ఛోరీలు ఇంతకు మునుపు కూడా ప్రక్కన షాపుల్లో జరిగియాని, అలాంటి వారిపై పోలీసులు నిఘా పెట్టాలని వారు తెలిపారు.

## పాఠశాల నందు పేరెంట్స్ కమిటీ సమావేశం



విధ్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేస్తున్న స్కూల్ కమిటీ చైర్మెన్ పసుపులేటి హరి

నల్లచెరువు, ఏప్రెల్ 29, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ స్కూల్ ప్రభుత్వ పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌వలీ, స్కూల్ కమిటీ చైర్మెన్ పసుపులేటి హరి,వైస్ చైర్మెన్ మదార్‌వలిల అధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. విధ్యార్థులు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను అందజేశారు. అనంతరం స్కూల్ చైర్మెన్ హరి మాట్లాడుతూ విధ్యార్థులు చదువు పట్ల శ్రద్ద చూపించి స్కూల్‌కు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను కూడా మెరుగైన రీతిలో అభివృద్ది చేశారని, విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా నాణ్యమైన వసతులు కల్పించాలని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి మంచి జ్ఞానోదయాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విధ్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## దాహార్తి కేంద్రం ప్రారంభం

నల్లమాడ ఏప్రిల్ 29 ప్రభాతవార్త

స్థానిక రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను తహాశీల్దార్ దేవేంద్రనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే వారి కోసం దాహార్తి కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు భరోసా జగనన్న : ఎమ్మెల్యే దుద్దుకుంట



ప్రభుత్వ పాలనపై మహిళతో అభిప్రాయాన్ని సేకరిస్తున్న ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

రాష్ట్రంలో జగనన్న పాలనలోని అభివృద్ధి కార్యాక్రమాలే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చింతమానుపల్లి సచివాలయ పరిధిలోని అచ్చుమియాపల్లి, నాయనవారిపల్లి, కాటమరెడ్డిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, మల్లోలపల్లి, మల్లిమల్లోల పల్లిలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా అచ్చేమియాపల్లిలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లోని ప్రజలు బాణాసంచా పేల్చుతూ, మహిళలు మంగళహారతులు పట్టి పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి గడపను సందర్శించి ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో స్వయంగా నమోదు చేశారు. జగన్ పాలనపై సంతోషం వ్యక్తం చేసిన వారితో మిస్డ్ కాల్ ఇప్పించి వారి ఇల్లకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు జగన్‌పాలనపై సంతృప్తి, విశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగనన్న పాలనలో అందుతున్న సంక్షేమ ఫలాల లబ్ధి ద్వారా తమ కుటుంబ పోషణ గడుస్తున్న కొందరు వృద్ధులు ఎమ్మెల్యేతో వద్ద ఆనందబాష్పాలు కురిపించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓ పోలప్ప, ఈఓఆర్డీ రాజశేఖర్, ఎంపిపి తుమ్మల పర్వీన్‌భాను, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అందరూ సుభిక్షంగా ఉండాలి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29, ప్రభాతవార్త



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వెంకట్

మండలంలోని శేషయ్య గారిపల్లిలో కొలిచేవారికి కొంగు బంగారమై విరాజిల్లు తున్న అక్కదేవతల ఆలయం లో టిడిపి వడ్డెర రాష్ట్ర సాధికారిత సమితి కన్వీనర్ వడ్డే వెంకట్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అక్కదేవతల జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన వెంకట్‌కు గ్రామప్రజలు పూలమాలలు వేసి డప్పు వాయిద్యాల చప్పుల్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి కాయ, కర్పూరం, పుష్పం సమరి ్పంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అక్కదేవతల కృపా కటాక్షములతో రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ తల్లిని వేడుకున్నానన్నారు. గ్రామస్తులు వెంకట్‌కు పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంజి, లోకేష్, చెనరాయుడు, విష్ణు, నరేంద్ర, సురేంద్ర, బాలాజీ, జస్వంత్, చంద్ర, మోహన్, ప్రసాద్, గంగరాజు, గంగాద్రి, నారాయణస్వామితో పాటు ఐటిడిపి మంకముతక మంజునాథ్ పాల్గొన్నారు.

## స్వామివారి అన్నదాన కార్యక్రమానికి విరాళం

నల్లచెరువు, ఏప్రెల్ 29, ప్రభాతవార్త:

మండల పరిధిలోని శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి నిత్యం పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి దేవస్థానంకు శనివారం సందర్భంగా కదిరి బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత మంచి శివశంకర్ సతీమని శ్రీదేవి దంపతులు స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమానికి తమవంతుగా రూ. 10,116 రూపాయలు ఆలయ చైర్మెన్ దేవరింటి భాస్కర్‌రెడ్డికు అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించడానికి దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి దుశ్శాలువతో సన్మానించి స్వామివారి చిత్రపటానికి బహుకరించారు. స్వామివారి దర్శనానికి వచ్చు భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా స్వామివారి తీర్థప్రసాదాలు, భోజన సదుపాయం కల్పించి, భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సూర్యనారాయణ,గోవింద్‌రెడ్డి, భక్తాదులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మెన్

